'ధరణి' సమస్యలు పరిష్కరించాలి

- సర్వసభ్య సమావేశం తీర్మానం
- పలు అభివృద్ధి పనుల ప్రగతిపై చర్చ



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ప్రజాప్రతినిధులు

బుగ్గారం: ధరణి వలన కొంతమంది రైతులు ఇబ్బందులు పడుతున్నారని ,వాటిని వెంటనే పరిష్కరించడానికి తగిన చర్యలు చేపట్టాలని బుగ్గారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో సభ్యులు తీర్మానం చేశారు. ఎంపీపీ బాదినేని రాజమణి అధ్యక్షతన శనివారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో గ్రామాల్లో జరుగుతున్న పలు అభివృద్ధి పనుల తీరుతెన్నులపై చర్చించారు. వివిధ శాఖలకు చెందిన అధికారులు తమ పరిధిలో జరుగుతున్న పనుల వివరాలను సభలో ప్రస్తావించారు .ఈ సందర్భంగా పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు తమ ప్రాంతాలలోని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.పత్తి సాగు చేసే రైతులు పెరుగుతున్నందునా విత్తనాలను అందుబాటులో ఉంచాలని వెల్గొండ సర్పంచ్ గాదె తిరుపతి కోరారు. ఎండలు మండుతున్నందున ఒంటిపూట బడులను నిర్వహించేలా చర్యలు చేపట్టాలని మద్దునూర్ సర్పంచ్ బత్తుల తిరుపతి కోరారు. రైతుల ఖాతాల్లో ధాన్యం డబ్బులు వేయాలని ప్రజాప్రతినిధులు కోరారు. మండల కో ఆప్షన్ సభ్యుడు రహమాన్ మాట్లాడుతూ బుగ్గారం ఊర చెరువుకు మత్తడి సరిగా లేకపోవడంతో వర్షాకాలం చెరువు నిండి ప్రజలందరూ భయం భయంగా గడుపుతున్నారని, మత్తడిని పటిష్టం చేసి తూము నిర్మించాలని కోరారు.అనంతరం జెడ్పీటీసీ,ఎంపీపీ మాట్లాడుతూ మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తూ పెండింగ్ పనులను సకాలంలో పూర్తి చేయాలన్నారు. అలాగే సమావేశానికి అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని ఆదేశించారు. ఈ సందర్భంగా అటవీశాఖ అధికారులు సర్వసభ్య సమావేశాలకు గైర్హాజరు అవుతున్నారని ఇది సరికాదని జెడ్పీటీసీ రాజేందర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. మండలంలో జరుగుతున్న పనుల ప్రగతి,సమస్యలను గురించి చర్చించి మండలాభివృద్ధికి దోహదం చేసే ముఖ్యమైన సర్వసభ్య సమావేశానికి కొందరు సర్పంచులు,అధికారులు హాజరు కాలేదు. సమావేశంలో ఎంపీడీవో తిరుపతి, తహసీల్దార్ ఫారుఖ్, మండల కో ఆప్షన్ సభ్యుడు రహమాన్, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

వాడీవేడిగా సర్వసభ్య సమావేశం



అధికారులను ప్రశ్నిస్తున్న గొల్లపల్లి సర్పంచ్

గొల్లపల్లి: మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ నక్క శంకర్ అధ్యక్షతన శనివారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం వాడీ వేడిగా కొనసాగింది.అధికారులు ప్రగతి నివేకలు చదివి వినిపించారు.గత సమావేశంలో అధికారుల దృష్టికి తీసుకు వచ్చిన సమస్యలు పరిష్కరించకపోవడంతో సర్పంచ్‌లు నిషాంత్ రెడ్డి చిర్ర గంగాధర్, పురంశెట్టి వెంకట పద్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. గోవిందుపల్లి, చిల్వాకోడూర్ శివారు చెరువులో అక్రమంగా మట్టి తరలించుకు పోతున్న పట్టించుకోవడం లేదని సర్పంచ్ నిషాంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులకు, బీఆర్‌ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు ముడుపులు తీసుకుని ఇలా అక్రమ రవాణాకు పూనుకోవడం దౌర్జాన్యమని వీటిని అడ్డుకోవాలని డిమాండ్ చేశారు. మండలంలో విద్యుత్ సమస్యలున్నా.. అధికారులు పరిష్కరించడం లేదని సభ్యులు ధ్వజమెత్తారు. రైతులు ధాన్యం అమ్మి రెండు నెలల గడుస్తున్నా ఇంతవరకు అధికారుల నిర్లక్ష్యం వల్లే ఇలా జరుగుతుందన్నారు. ప్రజా సమస్యలు చర్చించి పరిష్కరించే అవకాశం ఉన్నా.. మెజార్టీ సభ్యులు, పలు శాఖల అధికారులు సమావేశానికి హాజరు కాకపోవడంతో సమస్యల ప్రస్తావన అంతంతమాత్రంగా ఉంది.

గ్రామాలను అభివృద్ధి చేయడమే లక్ష్యం

- కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు



అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే,ఎమ్మెల్సీ శంకుస్థాపన

ఇబ్రహీంపట్నం: గ్రామాలు అభివృద్ధి చేయడమే లక్ష్యమని ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు అన్నారు. శనివారం మండలంలోని గోధూర్‌లో రూ. 70 లక్షలతో నిర్మించనున్న డ్రైనేజీ పనులకు ఎమ్మెల్సీ రమణతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా డ్రెయినేజీ నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ రమణ, ఎంపీపీ జాజాల భీమేశ్వరి, జెడ్పీటీసీ భారతి, వైస్ ఎంపీపీ నోముల లక్ష్మారెడ్డి, సర్పంచ్ సామ ప్రభాకర్, ఆర్‌అండ్‌బీ డీఈ వెంకటరమణ, ఏఈ వేణు, సింగిల్‌విండో చైర్మన్ సాగర్‌రావు, నాయకులు పాల్గొన్నారు.

గిరిజనులకు అండగా తెలంగాణ ప్రభుత్వం

గిరిజనుల అభివృద్ధిప్రభుత్వం అండగా ఉందని ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు, ఎమ్మెల్సీ రమణలు అన్నారు. మండలంలోని తిమ్మాపూర్ తండా, ఎర్రాపూర్ తండాలో శనివారం గిరిజన ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు తిమ్మాపూర్ తండాలో ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు, ఎమ్మెల్సీ రమణలకు గిరిజనులు నృత్యాలతో ఘనంగా స్వాగతం పలికారు. సంతూ సేవాలాల్ ఆలయానికి రూ. 5 లక్షలు మంజురు చేస్తానని హామీ ఇచ్చారు. సేవాలాల్ ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ జాజాల భీమేశ్వరి, జెడ్పీటీసీ భారతి, సర్పంచ్ జేన్ని భాయి, వైస్ ఎంపీపీ నోముల లక్ష్మారెడ్డి, ఎంపీడీవో ప్రభు, నాయకులు పాల్గొన్నారు.

వృద్ధుల సంరక్షణ చట్టం పకడ్బందీగా అమలు

మెట్‌పల్లి: రాష్ట్రంలో వృద్ధుల సంరక్షణ చట్టం పకడ్బందీగా అమలయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు అన్నారు. సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ముద్రించిన వయో వృద్ధుల సంరక్షణ చట్టం అవగాహన కరపత్రాలను పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో శనివారం ఎమ్మెల్యే ఆవిష్కరించారు. కార్యక్రమంలో హరి అశోక్‌కుమార్, హన్మంత్ రెడ్డి, విశ్వనాథం, ఒజ్జెల బుచ్చిరెడ్డి, సౌడాల కమలాకర్ తదితరులున్నారు.

తండాలను పంచాయతీలుగా మార్చిన ఘనత బీఆర్‌ఎస్‌దే

మెట్‌పల్లి: తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చిన ఘనత బీఆర్‌ఎస్‌దేనని ఎమ్మెల్సీ రమణ, ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు అన్నారు. మండలంలోని ఎఎస్సార్ తండాలో శనివారం గిరిజన మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులకు శంకు స్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మారు సాయిరెడ్డి, సర్పంచ్ జమున, ఎంపీటీసీ రజిత, ఎంపీడీవో భీమేశ్‌రెడ్డి తదితరులున్నారు.

'తెలంగాణలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే'

మల్లాపూర్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ప్రజాక్షేత్రంలో ఎండగడుతున్న కాంగ్రెస్ పార్టీయే తెలంగాణలో ప్రజా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు డాక్టర్ కుందారపు సాయికుమార్ అన్నారు. మండలంలోని పాతదాం రాజుపల్లిలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కర్ణాటకలో ఇటీవల జరిగిన ఎన్నికల్లో బీజేపీ మతవిద్వేషాలతో, ధన బలంతో ఎలాగైనా గెలవాలన్న కుట్రలను ప్రజలు తిప్పికొట్టి బుద్ధిచెప్పారన్నారు. దేశంతో పాటు తెలంగాణలోనూ ఇవే ఫలితాలు రాబోతున్నాయని, 2024 సార్వత్రిక ఎన్నికలకు ఇది తెలిమెట్టుగా అభివర్ణించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల నాయకులు పాల్గొన్నారు.

ధాన్యం డబ్బులు చెల్లించాలి

ధర్మపురి: వరి కొనుగోళ్లు చేపట్టి మూడు నెలలు కావస్తున్న రైతుల ఖాతాల్లో డబ్బుల జమ చేయలేదని ప్రభుత్వం తక్షణం డబ్బులు చెల్లించాలని కోరుతూ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ధర్మపురిలో బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు కోడిపెల్లి గోపాల్ ఆధ్వర్యంలో శనివారం ధర్నా చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం డబ్బులు చెల్లించక పోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ప్రభుత్వం తక్షణం రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ వెంకటేశ్‌కు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో నాయకులు బెజ్జారపు లవన్‌కుమార్, పిల్లి శ్రీనివాస్, బండారు లక్ష్మణ్, బాకి రాజేశ్, ప్రణీత్ తదితరులున్నారు.

స్కాలర్‌షిప్‌కు డిగ్రీ విద్యార్థుల ఎంపిక

కోరుట్ల: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు సంతూర్ స్కాలర్‌షిప్‌కుఎంపికయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులను శనివారం ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. వాసవి, వైస్ ప్రిన్సిపాల్ భూర్ల నరేశ్ అభినందించారు. విప్రో ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు డిగ్రీ పూర్తయ్యే వరకు ఏటా రూ. 24 వేలు అందజేస్తారు. కార్యక్రమంలో అధ్యాపకులు నీరజ, మల్లికార్జున్, రాజ శేఖర్, శ్రీనివాస్, సుఖప్రదా దేవి, నాగరాజు, హ్యుమేరా సుల్తానా, ఫాతిమా, వసీం బేగం, రుఖియా సహేద్, మహత, ప్రతిమ పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్ పాసుల పంపిణీ

మల్లాపూర్: ప్రభుత్వ రంగ సంస్థ ఆర్టీసీని ప్రజలే కాపాడుకోవాలని సర్పంచ్ భూక్య గోవింద్‌నాయక్ అన్నారు. శనివారం మండలంలోని సిరిపూర్‌లో దివ్యాంగులకు రాయితీ పాసులను పంపిణీ చేశారు.కార్యక్రమంలో మెట్‌పల్లి డిపో ఆర్టీసీ అధికారులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజనుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి



ఏడుమోటలపల్లిలో అధికారులు,తండావాసుల ర్యాలీ

పెగడపల్లి: గిరిజనుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని జెడ్పీటీసీ రాజేందర్‌రావు అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం మండలంలోని ఏడుమోటలపల్లి తండాలో గిరిజన దినోత్సవం నిర్వహించారు. గిరిజనుల ఆచార ప్రకారం పులియాగనంతో అధికారులు, తండా వాసులు ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో సర్పంచ్ ఇస్లావత్ రవినాయక్, ఎంపీటీసీ అంజయ్య, ఎంపీవో మహేందర్, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

మల్లాపూర్: గిరిజనుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎంపీపీ కాటిపెల్లి సరోజన, తహసీల్దార్ రవీందర్ అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం మల్లాపూర్ మండలంలోని నడికుడ, వాల్గొండ తండా, ఒబులాపూర్ తండా గ్రామాల్లో గిరిజన దినోత్సవం నిర్వహించారు. ప్రభుత్వం ఎస్టీల సామాజిక, ఆర్థిక ఎదుగుదలకు ఎంతగానో తోడ్పాటును అందిస్తుందన్నారు. కార్యక్రమాల్లో ఎంపీడీవో రాజశ్రీనివాస్, ఎంపీవో జగదీశ్, సర్పంచ్‌లు భూక్య గోవింద్‌నాయక్, భూక్య రుక్మా, ధరంసోత్ కళావతి, భూక్య రజిత, ఎంపీటీసీలు ఏనుగు రాంరెడ్డి, క్యాతం సుజాత, నాయకులు, పంచాయతీ కార్యదర్శులు, గిరిజన మహిళలు పాల్గొన్నారు.

'విమర్శలు మాని అభివృద్ధిపై దృష్టి పెట్టాలి'

కోరుట్ల: బీఆర్‌ఎస్ నాయకులు బీజేపీ నాయకులపై విమర్శలు మాని తమ,తమ వార్డుల్లో అభివృద్ధిపై దృష్టి పెట్టాలని బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సోరుపాక రమేశ్, బీజేపీ మండల అధ్యక్షుడు పంచిరి విజయ్ అన్నారు. ఈ మేరకు పట్టణంలో మాట్లాడుతూ బీఆర్‌ఎస్ నాయకులు బీజేపీ నియోజకవర్గ నాయకుడిపై చేసిన అనుచిత వాఖ్యలను ఖండిస్తున్నామన్నారు. తమ నాయకుని మెప్పు కోసం ఇతర పార్టీల నాయకులను విమర్శించటం సరికాదన్నారు. హామీల అమలులో బీఆర్‌ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. మరోసారి తమ పార్టీ నాయకులపై అనుచిత వాఖ్యలు చేస్తే సహించేది లేదన్నారు. కార్యక్రమంలో యూసుఫ్‌నగర్ సర్పంచ్ గుగ్గిళ్ల తుక్కారం గౌడ్, నాయకులు గిన్నెల అశోక్, తోట రాజేష్, బత్తుల శ్రీనివాస్, ఓం ప్రకాష్, తిరుమల్, గంగాధర్, వెంకటరెడ్డి రాజు, శశిరమేశ్ పాల్గొన్నారు.

పారిశుధ్యంపై స్పెషల్ డ్రైవ్

కోరుట్ల రూరల్: మండలంలోని కల్లూర్‌లో శనివారం పారిశుధ్యంపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. రాష్ట్ర అవతరణ ఉత్సవాల్లో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టామని సర్పంచ్ వనతడుపుల అంజయ్య తెలిపారు. గ్రామంలోని డ్రెయినేజీల్లో చెత్తను తొలగించి, రోడ్లు శుభ్రం చే శారు. పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ సంకె రాకేశ్, ఎంపీటీసీ చిట్నేని లత, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

బస్సులు నడిపించాలని గ్రామస్తుల ధర్నా



రోడ్డుపై నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

రాయికల్: మండలంలోని మైతాపూర్‌కు ఆర్టీసీ బస్సులు నడిపించాలని డిమాండ్ చేస్తూ శనివారం గ్రామస్తులు ధర్నా చేపట్టారు. రోడ్డుపై వంటా వార్పుతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామానికి బస్సులు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామస్తుల ఆందోళనతో ఎక్కడికక్కడ వాహనాలు నిలిచిపోయాయి. జగిత్యాల రూరల్ సీఐ ఆరిఫ్‌ఖాన్ సంఘటన స్థలానికి చేరుకుని కోరుట్ల డిపో అధికారుల తో మాట్లాడి బస్సులు నడిపే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

క్లుప్తంగా

కోరుట్ల మున్సిపల్‌కు పలు అవార్డులు



అవార్డు అందుకుంటున్న చైర్‌పర్సన్,కమిషనర్

కోరుట్ల: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మున్సిపాల్టీలకు అందించిన అవార్డుల్లో హరితహారం, పబ్లిక్ టాయ్‌లెట్స్ నిర్వహణ విభాగంలో రాష్ట్రంలో రెండో స్థానంలో నిలిచినందుకు శుక్రవారం రాత్రి హైదరాబాద్‌లోని శిల్పకళ వేదికపై మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా చైర్‌పర్సన్ అన్నం లావణ్య, కమిషనర్ అయాజ్ అవార్డులు అందుకున్నారు. వరుసగా ఉత్తమ ఫలితాలు సాధిస్తున్న కోరుట్ల మున్సిపల్ ప్రజాప్రతినిధులు, అధికారులను మంత్రి కేటీఆర్ అభినందించారు.

ఎస్సీ వర్గీకరణకు మరో పోరాటం



మాట్లాడుతున్న నాయకులు

సారంగాపూర్: పాలకుల నిర్లక్ష్యం, పక్షపాత వైఖరి కారణంగా న్యాయబద్ధమైన ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించడం లేదని మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా కన్వీనర్ దుమాల గంగారాం మాదిగ, జిల్లా కో కన్వీనర్ బెజ్జంకి సతీష్‌మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ సురుగు శ్రీను (జగన్)లు అన్నారు. సారంగాపూర్‌లో శనివారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు మంద కృష్ణ మాదిగ నాయకత్వంలో జూలైలో మాదిగలు మరో పోరాటానికి సిద్ధం కావాలని కోరారు. సమావేశంలో నాయకులు మీసాల చంద్రయ్య, చాతరాసి లక్ష్మీరాజం, బదినేపల్లి గంగారాం, తిరుపల్లి భూమయ్య, గుర్రపు రాజయ్య, జంగం రవీందర్, చిట్యాల మల్లయ్య పాల్గొన్నారు.

కుల సంఘాల అభివృద్ధికి ప్రభుత్వ ప్రాధాన్యం



ప్రొసీడింగ్ కాపీ అందిస్తున్న డాక్టర్ సంజయ్

కోరుట్ల: రాష్ట్ర ప్రభుత్వం కుల సంఘాల అభివృద్ధికి తగిన ప్రాధాన్యం ఇస్తుందని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అన్నారు. ఈ మేరకు శనివారం పట్టణంలోని గాండ్ల తిలకేశ్వర సంఘం అభివృద్ధికి మంజూరైన రూ. 5 లక్షల ప్రొసీడింగ్ పత్రాలను కౌన్సిలర్ బలిజ పద్మతో కలిసి సంజయ్ సంఘం నాయకులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల సంఘాల అభివృద్ధి కోసం ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు కోట్లాది రూపాయలు మంజూరు చేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు సింగిరెడ్డి నారాయణ రెడ్డి, పట్టణ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు అన్నం అనిల్, మున్సిపల్ వైస్ చైర్మన్ పవన్, కౌన్సిలర్ మోర్తాడ్ లక్ష్మీ నారాయణ, బీఆర్‌ఎస్ పట్టణ యూత్ ఉపాధ్యక్షుడు శివప్రసాద్, సంఘ అధ్యక్షుడు కనుకయ్య,తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలి

సారంగాపూర్: ప్రతీ ఒక్కరు ఓటరుగా తమ పేరు నమోదు చేసుకోవాలని మెప్మా ఏవో శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. శనివారం మండలంలోని భీంరెడ్డిగూడెం, లచ్చనాయక్‌తండా, ధర్మనాయక్‌తండా గ్రామాల్లో ఓటు నమోదు, ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. ఓటుతో తమ హక్కులను సాధించుకోవడానికి అవకాశం ఉంటుందని, ఓటును దుర్వినియోగం చేసుకోకుండా సరిగ్గా వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీవో శశికుమార్‌రెడ్డి, సర్పంచులు బుచ్చిమల్లు, భూక్య సంతోష్, కార్యదర్శులు జల, హేమలత, ఉపసర్పంచ్‌లు ఊషన్న, సీల తదితరులు ఉన్నారు.

ఆధ్యాత్మిక కేంద్రాల్లో ప్రత్యేక కార్యక్రమాలు

జగిత్యాల: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో ఆధ్యాత్మిక కేంద్రాల్లో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ బీఎస్ లత అన్నారు. తెలంగాణ ఆధ్యాత్మిక దినోత్సవంపై వివిధ మతస్తుల ప్రతినిధులతో ఆమె సమావేశం నిర్వహించిన సందర్భంగా దేవాలయాలు, మసీదులు, చర్చిలు, గురుద్వారాల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించాలని, వాటిని సుందరంగా అలంకరించాలని తెలిపారు. తెలంగాణ ప్రజలు సుభిక్షంగా ఉండాలని కార్యక్రమాలు ఆయా కేంద్రాల్లో ప్రార్థనలు జరగాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో అధికారులు నరేశ్, సాయిబాబా ఉన్నారు.

గిరిజనులకు రిజర్వేషన్లు పెంచింది బీఆర్‌ఎస్సే

- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్



గిరిజనులతో కలిసి నృత్యం చేస్తున్న ఎమ్మెల్యే

సారంగాపూర్: గిరిజనుల జనాభాకు అనుగుణంగా ప్రభుత్వం రిజర్వేషన్లను 10 శాతం పెంచిందని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లోని పలు గ్రామాల్లో జరిగిన గిరిజనోత్సవాల్లో పాల్గొని మాట్లాడారు. రిజర్వేషన్లు పెంచడంతో గిరిజనులకు విద్యా, ఉద్యోగావకాశాలు పెరిగాయన్నారు. పోడు భూములకు పట్టాలిచ్చి ఎకరాకు రూ.5 వేలుప్రభుత్వం అందిస్తుందని చెప్పారు. కార్యక్రమాల్లో ఉమ్మడి జిల్లా కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ ముప్పాల రాంచందర్‌రావు, ఎంపీపీ కోల జమున, జెడ్పీటీసీ మేడిపల్లి మనోహర్‌రెడ్డి, కొల్ముల రమణ, సర్పంచ్‌లు సుగుణాబాయి, రవీందర్, అసునూరి భీమక్క, కొత్తూరి రాజేశ్వరి, శ్రీలత, మైనేని బుచ్చిమల్లు, భూక్య సంతోశ్, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు రాజేందర్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, భూక్య అరుణ్ పాల్గొన్నారు.

గిరిజనులతో కలిసి ఎమ్మెల్యే సంబరాలు

రాయికల్: మండలంలోని మంత్యానాయక్ తండాలో శనివారం గిరిజన ఉత్సవాల్లో ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ లావుడ్య సంధ్యారాణి, జెడ్పీటీసీ జాదవ్ అశ్విని, సర్పంచ్ బంగారి తండావాసులతో కలిసి స్టెప్పులు వేసి అందరిని ఉత్సాహపరిచారు.

ప్రజలకు సేవ చేయాలనే ఉచిత వైద్యశిబిరాలు



మందులు పంపిణీ చేస్తున్న లక్ష్మీనరసింహారావు

కథలాపూర్: గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యం అందించి వారికి సేవా చేయాలని ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు చల్మెడ ఆనందరావు వైద్య విజ్ఞాన సంస్థ చైర్మన్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు చల్మెడ లక్ష్మీనరసింహారావు అన్నారు. శనివారం భీమారం మండలం మన్నెగూడెంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి 1,700 మందికి వైద్యపరీక్షలు చేశారు. ప్రత్యేక వైద్యనిపుణులు ప్రజలకు చికిత్సలందించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ప్రజలు ఆరోగ్యంగా ఉండాలని తాము ఉచిత వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నామని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నరేశ్‌రెడ్డి, ఉపసర్పంచ్ సావిత్రి, జిర్ఫ్ స్వచ్ఛంధ సంస్థ అధ్యక్షుడు అంగడి ఆనంద్, శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల ఆరాధ్య దైవం సేవాలాల్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

కొండగట్టు: గిరిజనులు ఆరాధ్య దైవం సేవాలాల్ మహరాజ్ అన్ని చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. రాష్ట్ర అవతరణ ఉత్సవాల్లో భాగంగా కొడిమ్యాల మండలం గంగారం తండాలో గిరిజనోత్సవంలో పాల్గొని మాట్లాడారు. తండాలను గ్రామ పంచాయతీలుగా చేసిన ఘనత సీఎం కేసీఆర్‌దే అన్నారు. రాష్ట్రంలో 3146 గిరిజన తండాలను గ్రామ పంచాయతీలుగా చేసి అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు.అధికారకంగా ఆదివాసి పండుగలు జరుపుతున్న ఏకైక ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వమన్నారు. గిరిజనులకు 10 శాతం రిజర్వేషన్లు పెంచి, వారి సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ భోజ్యా నాయక్, ఎంపీటీసీ గుగులోత్ సుజాత, ఎంపీపీ మేనేని స్వర్ణలత, జెడ్పీటీసీ పునుగోటి ప్రశాంతి, నాయకులు గ్రామస్తులు పాల్గొన్నారు.

బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయాలని బీజేపీ నిరసన



నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

కథలాపూర్: మండలంలోని సిరికొండ– తక్కళ్లపెల్లి వాగుపై నిర్మిస్తున్న బ్రిడ్జి త్వరగా పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ నాయకులు శనివారం అర్ధనగ్న ప్రదర్శనతో నిరసన తెలిపారు. అంతకుముందు శిలాఫలకానికి క్షీరాభిషేకం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు కొడిపెల్లి గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. బ్రిడ్జి పనులు ప్రారంభించి ఆరేళ్లు గడిచిన ప్రభుత్వం పూర్తి చేయకపోవడం సిగ్గుచేటన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు అభివృద్ధి పనుల విషయంలో నిర్లక్ష్యం చేస్తున్నారని మండిపడ్డారు. బ్రిడ్జి పూర్తయితే కథలాపూర్, మేడిపెల్లి మండలాల మధ్య రవాణా సౌకర్యం మెరుగవుతుందని తెలిసినా.. ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మొలిగే శ్రీనివాస్, వెంకటేశ్వర్‌రావు, మల్యాల మారుతి, బద్రి సత్యం, అజయ్‌రావు, గాంధారి శ్రీనివాస్, ప్రకాశ్, జిల్లా సత్యం తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ఆయిల్ పామ్ సాగుతో అధికాదాయం

బుగ్గారం: ఆయిల్ పామ్ సాగుతో రైతులు అధికాదాయం పొందవని వ్యవసాయశాఖ అధికారులు అన్నారు. శనివారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో స్థానిక రైతువేదికలో అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయిల్ పామ్ పంటకు ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ,సాగులో పాటించాల్సిన మెలకువలు, యాజమాన్య పద్ధతులు, పంట మార్కెటింగ్ తదితర విషయాలపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం పలు ఫర్టిలైజర్ షాపుల్లో పోలీసులతోకలిసి తనిఖీ చేపట్టారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ సభ్యుడు జంగ శ్రీనివాస్, మండల ఇన్‌చార్జి ఏవో శిరీషా, ఏఈవోలు శ్రీనివాస్,అక్షయ్,స్థానిక రైతులు పాల్గొన్నారు.

సంపూర్ణ ఆరోగ్యానికి యోగా శ్రీరామ రక్ష

ఇబ్రహీంపట్నం: సంపూర్ణ ఆరోగ్యానికి యోగా శ్రీరామ రక్ష అని యోగా శిక్షకులు చిట్యాల బాలయ్య అన్నారు. ఈ నెల 21న ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు శనివారం ఒక్క రోజు యోగా శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు యోగాసనాలను నేర్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మద్దిరాల గణేశ్, పీఈటీ రాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నాటుసారా విక్రేత బైండోవర్

కథలాపూర్: మండలంలోని దుంపేట గ్రామానికి చెందిన ఓ మహిళ నాటుసారా విక్రయిస్తుందని అబ్కారీశాఖ అధికారులు పట్టుకుని తహసీల్దార్ శ్రీనివాస్ ఎదుట శనివారం బైండోవర్ చేశారు. ఇక నుంచి నాటుసారా విక్రయించమని సదరు మహిళ వ్యక్తిగత పూచికత్తుతో వదిలేసినట్లు అబ్కారీ శాఖ మెట్‌పల్లి సీఐ రాధ తెలిపారు.

ఆకట్టుకున్న సాధనాశూరుల విన్యాసాలు

మల్యాల: మండల కేంద్రంలో సాధనాశూరుల విన్యాసాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. మండల కేంద్రంలోని అంగడిబజార్‌లో శనివారం రాత్రి సాధనాశూరుల విన్యాసాలు అబ్బురపరిచాయి. పద్మశాలీ ఆశ్రిత కులం సాధనశూరులు తమ కుల వృత్తిని భావితరాలకు తెలియజేసేందుకు ఏటా గ్రామాల్లో విన్యాసాలు చేస్తున్నామని తెలిపారు.

ఆయిల్‌పామ్ సాగుకు ప్రాధాన్యం

మల్లాపూర్: ఆయిల్‌పామ్ సాగుకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందని ఎంపీపీ కాటిపెల్లి సరోజన అన్నారు. మండలంలోని పాతదాంరాజుపల్లిలో వ్యవసాయ అధికారులు, రైతులతో కలిసి ఆయిల్ పామ్ పంటసాగును పరిశీలించి మాట్లాడారు. ఆయిల్‌పామ్ సాగుకు రైతులు ముందుకురావాలన్నారు. కేవలం రూ.10 నుంచి 15 వేల పెట్టుబడితో ఒక ఎకరాకు రూ.1 లక్ష వరకు ఆదాయం పొందచ్చన్నారు. ఆయిల్‌పామ్ పంటతో పాటు అంతరపంటలుగా అన్నిరకాల కూరగాయలు, పంటలు సాగు చేయవచ్చని సూచించారు. రైతులకు సబ్సిడీపై డ్రిప్ పరికరాలను అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి లావణ్య, సర్పంచ్ మైదాసు శ్రీనివాస్, ఎంపీటీసీ క్యాతం సుజాత, నాయకులు కాటిపెల్లి ఆదిరెడ్డి, క్యాతం నరేశ్‌రెడ్డి, ఏఈవో, రైతులు పాల్గొన్నారు.